క్లుప్తంగా

జేసీ ఇలక్కియకు ఘనంగా వీడ్కోలు



జేసీ ఇలక్కియను సత్కరిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు, కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లా మొదటి జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఇలక్కియ సుమారు మూడేళ్ల పాటు మానవత, సానుకూల దృక్పథంతో ఉత్తమ సేవలు అందించారని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఇలక్కియను రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారిగా బదిలీ చేయడంతో బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. సభకు ముఖ్య అతిథిగా ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా అటవీ అధికారిణి కె.భరణి, జిల్లా పౌరసరఫరా సంస్థ డీఎం డి.పుష్పమణి తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొని ఆమెను సత్కరించి, ఆమె సేవలను కొనియాడారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం

కాకినాడ సిటీ: రెవెన్యూ శాఖలో సుదీర్ఘకాలం పని చేసిన సీనియర్ సహాయకులు వాసంశెట్టి నాగభూషణం, జూనియర్ సహాయకులు కోస్తి వెంకటేశ్వరరావు అందించిన సేవలు అభినందనీయమని జాయింట్ కలెక్టర్ సి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పదవీ విరమణ చేసిన ఇద్దరు ఉద్యోగులకు కలెక్టరేట్ సిబ్బంది, అధికారులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో జేసీ ప్రవీణ్‌ఆదిత్య ముఖ్య అతిథిగా పాల్గొని వాసంశెట్టి నాగభూషణం, కోస్తి వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.శ్రీరమణి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధిపతులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ కమిషనర్‌గా వెంకటరావు



కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా జె.వెంకటరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన పార్వతీపురం మన్యం జిల్లాకు జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్నారు. సీహెచ్ నాగనరసింహారావు స్థానంలో ఆయన ఇక్కడికి వచ్చారు. ఒకటి రెండురోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- ఈఆర్వో కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో కిశోర్

కాకినాడ సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ ఈఆర్వో, ఆర్డీవో ఇట్ల కిశోర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కాకినాడ ఆర్డీవో కార్యాయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలో తుది జాబితా ప్రకటించే నాటికి 2,61,186 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 264 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామని, తుది జాబితా ప్రకటించే నాటికి నియోజకవర్గంలో 3978 మంది యువ ఓటర్లు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, ఎస్.అప్పారావు, కె. విజయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగం రవికి అభినందనలు



లింగం రవిని అభినందిస్తున్న అంగన్‌వాడీలు

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ డైరెక్టరుగా ఇటీవల నియమితులైన వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం రవిని రమణయ్యపేట గ్రామ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు అభినందించారు. రాయుడుపాలెం శేషాద్రినగర్ నివాసం వద్ద రవిని అంగన్‌వాడీలు అనురాధ, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, కృప, పద్మావతి తదతరులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డీకే వరప్రసాద్, పెద సత్యం తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి సాయం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు చెరువు గట్టు సెంటర్‌లో ఇటీవల ఫ్యాన్సీ, కూల్ హోమ్ దగ్ధమై ఆర్థికంగా నష్టపోయిన మట్టపర్తి తాతారావుకు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ రూ.5 వేల నగదు సాయం అందించారు. బుధవారం ఆయన అగ్నికి ఆహుతైన దుకాణాన్ని పరిశీలించి బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చదువులమ్మకు స్వర్ణ పతకం

- ఏళ్ల కృషికి, పట్టుదలకు పట్టాభిషేకం
- పతకాలు ప్రదానం చేసిన గవర్నర్ నజీర్



పదో స్నాతకోత్సవంలో గ్రూప్ ఫొటో దిగిన కులపతి, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప కులపతి ప్రసాదరాజు, పాలక మండలి సభ్యులు, డైరెక్టర్లు

బాలాజీచెరువు: చదువుల సరస్వతుల హర్షధ్వానాలతో స్థానిక జేఎన్‌టీయూకే ప్రాంగణం దద్దరిల్లిపోయింది. జేఎన్‌టీయూకే కాన్వొకేషన్ హాల్లో బుధవారం 10 స్నాతకోత్సవం కన్నుల పండగగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు చూస్తుండగా విద్యార్థులు సగర్వంగా పట్టాలు అందుకున్నారు. గవర్నర్ చేతుల మీదుగా స్వర్ణ పతకాలు, పీహెచ్‌డీలు అందుకున్న కొందరు భావోద్వేగానికి గురయ్యారు. అరుదైన సన్నివేశాలు, సెల్ఫీలు తమ సెల్‌ఫోన్లనో బంధించి మురిసిపోయారు. పట్టరాని ఆనందాలను వారి అభిప్రాయాల్లో..

రెండు స్వర్ణాలు సాధించా



నా పేరు బి.దుర్గా భవాని. పెట్రోలియం ఇంజినీరింగ్‌లో 8.92 ఉత్తీర్ణతతో స్వర్ణ పతకం, ఎండోమెంట్‌లో మరో స్వర్ణ పతకం సాధించడం చాలా సంతోషంగా ఉంది. డీఎలయిట్‌తో సాఫ్ట్‌వేర్ ఐదు లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నాను. జీవితంతో మరిచిపోలేని అనుభూతిగా ఈ వేడుక నిలిచి పోతుంది.

ఫార్మసీలో పీహెచ్‌డీ చేస్తా



నాపేరు ఎం.ప్రియదర్శిని. ఫార్మసీలో సాల్యుబిలిటీ డిసాల్యూషన్ రేటు పెంపుదల, ఫార్మలేషన్ అభివృద్ధి, స్వచ్ఛందంగా కరిగే బీసీఎస్ క్లాస్–2 అంశంపై సిద్ధాంత వ్యాసం రచించాను. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ ప్రొఫెసర్ ఎ.ప్రమీలారాణి పర్యవేక్షణలో సమర్పించాను. పీహెచ్‌డీ సాధించి కుటుంబ సభ్యుల సమక్షంలో తీసుకోవడం సంతోషంగా ఉంది. జీవితంలో ఇది మధుర ఘట్టంగా నిలిచిపోతుంది. విద్యతో అత్యుత్తమ అర్హత గల పీహెచ్‌డీ సాధించడం జీవితాశయంగా పెట్టుకుని సాధించాను. నా భర్త సహకారంతో ఇది సాధ్యమైయింది.

చాలా సంతోషంగా ఉంది



నాపేరు గుడాల దివ్య. బీటెక్ సివిల్ ఇంజినీరింగ్‌లో జేఎన్‌టీయూకేలో 9.37శాతం ఉత్తీర్ణత సాధించి స్వర్ణ పతకాన్ని గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉంది. టీసీఎస్‌లో ఉద్యోగం సాధించాను. గేట్ రాసి ఎంటెక్ చదవాలనుకుంటున్నాను.

సమాజ సేవే లక్ష్యం



నా పేరు సయ్యద్ అష్రఫ్. ప్రకాశం జిల్లా కందుకూరి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మైనింగ్ ఇంజినీరింగ్‌లో 7.38 శాతం సాధించి స్వర్ణ పతకం సాధించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి సమాజ సేవ చేయాలనేది నా లక్ష్యం.

రైతు బిడ్డ సాధించింది..



గవర్నర్ అబ్దుల్ నజీర్, ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి నుంచి స్వర్ణ పతకం స్వీకరిస్తున్న విజయలక్ష్మి

కరప: మండలం కూరాడ గ్రామానికి చెందిన రైతు వెలుగుబంట్ల రవినాయుడు (సురేష్) కోడలు వీరంరెడ్డి విజయలక్ష్మి పోస్టుగ్రాడ్యుయేషన్‌లో స్వర్ణ పతకం సాధించింది. రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని కాకినాడ ఆదిత్య కళాశాలలో 2020–22 విద్యా సంవత్సరంలో ఆమె ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ చదివారు. వర్సిటీ పరిధిలోని 60 కళాశాలల్లో మొదటి స్థానంలో నిలిచి ఈ ఘనత సాధించింది. బుధవారం వర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి చేతుల మీదుగా ఆమె స్వర్ణ పతకం అందుకున్నారు. కూరాడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెలుగుబంట్ల సూరిబాబు, మాజీ సర్పంచ్ రావుల ప్రసాద్ తదితరులు ఆమెను అభినందించారు.

మహిళాభివృద్ధితోనే కుటుంబ సంక్షేమం



మెగా చెక్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: మహిళలు అభివృద్ధి చెందినప్పుడే ఆ కుటుంబం అన్ని రంగాల్లోను ప్రగతి సాధించగలదని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. అందువల్లే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ బుధవారం కాకినాడలోని మూడు ప్రాంతాల్లో వేడుకగా సాగింది. స్థానిక వార్ఫురోడ్డు, గాంధీనగర్ పార్కు, చీడీలపొర ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమాలకు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షత వహించారు. వైఎస్సార్ ఆసరాకు సంబంధించిన మెగా చెక్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి విడుదల చేశారు. సీఎం జగన్ చిత్రపటానికి ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యుల సమక్షంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కాకినాడలో పేదలకు కేటాయించిన 31 వేల ఇళ్ల స్థలాల పట్టాలను మహిళల పేరుతోనే ఇచ్చామన్నారు. వీటితో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను మహిళలకు అందేలా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో ఎన్నో పేద కుటుంబాల్లో మహిళలకు మంచి గౌరవం దక్కిందన్నారు. అభివృద్ధి–సంక్షేమాన్ని కాంక్షించే సీఎం జగన్‌కు ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు.

నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా గడచిన నాలుగున్నరేళ్లలో రూ.102 కోట్ల నగదును స్వయం సహాయక సంఘాల సభ్యుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మైనార్టీ, బీసీ సెల్ ప్రాంతీయ సమన్వయ కర్తలు అబ్దుల్ బషీరుద్దీన్, అల్లి రాజబాబు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సీఎంఎం డేగల వెంకటరాజు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడితే సముచిత స్థానం



గగారిన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కురసాల



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- మాల కార్పొరేషన్ డైరెక్టర్ గగారిన్‌కు అభినందన

కాకినాడ రూరల్: పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి సముచిత స్థానం ఉంటుందని, ఇందుకు జంగా గగారిన్ నిదర్శనమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలోని రమణయ్యపేటకు చెందిన గగారిన్‌కు ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్గా ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా నియమించడంతో రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయనను అభినందించారు. తొలుత తనకు పదవి ఇచ్చిన కన్నబాబును మర్యాదపూర్వంగా కలిసిన గగారిన్ గజమాలతో సత్కరించారు. అనంతరం గగారిన్‌కు పూలమాల వేసి అభినందనలు తెలియజేశారు. కన్నబాబు మాట్లాడుతూ తనతో పాటు ఉంటూ కుటుంబ సభ్యుడిగా పార్టీ కోసం శ్రమిస్తున్న గగారిన్ గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఏదైనా మంచి బాధ్యతలు అప్పగించాలని కోరడంతో మాల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టరుగా జీవో ఇచ్చారన్నారు. ఈ పదవి సద్వినియోగం చేసుకుని ద్వారా పది మందికి ఉపయోగపడాలని గగారిన్‌కు సూచించారు. జిల్లా నుంచి వచ్చిన పలువురు దళిత నాయకులు, జర్నలిస్టులు గగారిన్‌ను అభినందించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార రాజా, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకుడు, యువకుడైన గగారిన్‌కు సముచిత స్థానం కల్పించారని ఇందుకు ఎమ్మెల్యే కన్నబాబు అభినందనీయులన్నారు. గగారిన్ ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు అన్నారు. సీఎంగా జగన్, ఎమ్మెల్యేగా కన్నబాబు విజయం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, పండూరు ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు దడాల జాషువా గిరి, రాష్ట్ర హిస్టరీ కార్పొరేషన్ డైరెక్టరు పుల్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

మండలంలోని ఇంద్రపాలెంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు వీటిని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఇంద్రపాలెం గ్రామ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని సామర్లకోట పంట కాల్వపై రూ.40 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి బుధవారం రాత్రి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

టీడీఆర్ల జారీపై 'కొండ'ంత దుష్ప్రచారం

- వనమాడి తీరుపై ఎమ్మెల్యే ద్వారంపూడి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ప్రజల ప్రయోజనార్థం టీడీఆర్ బాండ్లు జారీ చేసి సబ్‌స్టేషన్ నిర్మాణానికి సుమారు నాలుగున్నర ఎకరాల స్థలాన్ని సేకరిస్తే టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అభివృద్ధి నిరోధకశక్తిగా తయారై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోర్టు ప్రాంతంలో సుమారు 40 ఎకరాల ప్రభుత్వస్థలం అందుబాటులో ఉన్నప్పటికీ ఆ స్థలాన్ని వదిలి కోట్ల రూపాయల బాండ్లు విడుదల చేసి స్థలాన్ని కేటాయించారంటూ ఆయన చేసిన విమర్శలపై ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. కొండబాబు చెబుతున్న ఆ స్థలం సీఆర్‌జెడ్ జోన్–2 పరిధిలో ఉందని, కనీస పరిజ్ఞానం లేకుండా ఆ స్థలంలో సబ్ స్టేషన్ కట్టాలనడడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. సీఆర్‌జెడ్ స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వరన్న కనీస అవగాహన లేకుండా రాజకీయాల్లో కొనసాగుతూ అభివృద్ధికి అడ్డుపడుతున్నారన్నారు. అర్బన్ ప్రాంతంలో కార్పొరేషన్ ఖజానాకు ఒక్క రూపాయి నష్టం వాటిల్లకుండా కోట్ల రూపాయలు విలువైన స్థలాన్ని సేకరించే అవకాశం దక్కడం అదృష్టమన్నారు. ఇందుకు శ్రమించిన అధికారులను ప్రశంసిస్తూనే స్థలాన్ని ప్రజావసరాల కోసం టీడీఆర్ బాండ్ల రూపంలో ప్రభుత్వానికి ఇచ్చిన సదరు యజమానిని కూడా ఎమ్మెల్యే ద్వారంపూడి అభినందించారు. వాస్తవానికి అక్కడ పోర్టు భూములు ఉన్నప్పటికీ వాటిని సేకరించేందుకు ఎంతో ప్రయత్నించామని, దాదాపు ఆరు నెలల ప్రయత్నం తరువాత ఆచరణలో ఉన్న సాంకేతిక పరమైన ఇబ్బందుల వల్లే ప్రైవేటు స్థలాన్ని సేకరించామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమగ్ర సమాచారాన్ని తెలుసుకుని మాట్లాడితే ప్రజలు కూడా హర్షిస్తారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ స్వార్థంలో ఎంఎస్ఎన్ చార్టీస్‌లోని స్థలం అభివృద్ధిని కూడా కొండబాబు అడ్డుకున్నారని మండిపడ్డారు. అక్కడి విద్యార్థులకు మంచి ఆట స్థలం సమకూరుతుంటే తట్టుకోలేక న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుపడ్డారని ఎమ్మెల్యే ద్వారంపూడి ఆరోపించారు.

సమాజానికి మహిళా సేవలు అవసరం



సీనియర్ సభ్యులను సత్కరిస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: వైశ్యా లేడీస్ అసోసియేషన్ 36వ వార్షికోత్సవం స్థానిక వైఎంవీఏ హాలులో బుధవారం ఘనంగా ముగిసింది. వార్షికోత్సవ కన్వీనర్ పాబోలు చిన్నపున్నయ్య మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ వార్షికోత్సవ పోటీలలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అసోసియేషన్ కన్వీనర్ వెత్సా నాగలక్ష్మి మాట్లాడుతూ సమాజ అవసరాలతో పాటు మహిళా సమస్యలు ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటూ అవసరమైన సేవా కార్యక్రమాల ద్వారా చేయూత ఇవ్వడమే తమ సమాఖ్య ప్రధాన ఆశయమన్నారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. గత మూడున్నర దశాబ్దాలుగా సంస్థలో కమిటీ సభ్యులుగా సేవలందించిన 60 ఏళ్లు పైబడిన సభ్యులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు గుల్లపూడి ప్రియాంక, కార్యదర్శి బచ్చు హరిత, కోశాధికారి ముత్తా కనక దుర్గ పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి



చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అందరికీ సమాన ప్రమాణాలు గల విద్యా విధానాన్ని, సామాజిక న్యాయం అమలు చేయాలని కోరుతూ ఈ నెల మూడో తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్టీ బాలుర వసతి గృహం వద్ద చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన జరుగుతుందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుందన్నారు. యూనివర్శిటీలో స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా యూనివర్శిటీ గ్రాంట్ కమిషనర్‌ను రద్దు చేసిందన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో విద్యా వ్యాపారాన్ని నిషేధించలేదన్నారు. కుల, మత, భాషా పరమైన వివక్షలను చట్టంలో ప్రవేశపెట్టారన్నారు. అఖిల భారత విద్యా హక్కుల వేదిక పిలుపు మేరకు ఈ నెల 3న ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సిద్ధూ, ఎం.సాయికిరణ్, మూర్తి, ఆర్ నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు భేష్

- గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందన
- అభివృద్ధి పనులకు శ్రీకారం



రెడ్‌క్రాస్ అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

కాకినాడ: సమాజానికి ప్రయోజనం కలిగేలా జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న విభిన్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ కొనియాడారు. బుధవారం జేఎన్‌టీయూకే అతిథి గృహం వద్ద రూ.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ ఐ.బ్యాంక్, రూ.1.3 కోట్లతో నిర్మించనున్న రెడ్‌క్రాస్ శిశు, మహిళా సంక్షేమ శిక్షణ కేంద్ర నిర్మాణ పనులకు సంబంధించి శిలాఫలకాలను గవర్నర్ నజీర్ ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ కార్యకలాపాలను జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు గవర్నర్‌కు వివరించారు. జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులను గవర్నర్ అభినందించారు. కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సాంకేతిక సహకారంతో అత్యాధునిక పరికరాలతో రెడ్‌క్రాస్ ఐ బ్యాంక్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రతాప్‌నగర్‌లో మహిళా శిక్షణ కేంద్రాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ ఐ బ్యాంక్ ఏర్పాటుకు విరాళాన్ని అందజేసిన సాయి రామా ఫ్రోజెన్ ఫుడ్స్ అధినేత లకంసాని సత్యనారాయణకు మహిళా కేంద్రం నిర్మాణానికి రూ.43 లక్షలు సమకూర్చిన జెమినీ ఎడిబుల్ ఆయిల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావులను గవర్నర్‌కు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, జిల్లా వైస్ చైర్మన్ కె.సుగుణ, కార్యదర్శి కె.శివకుమార్, కోశాధికారి ఎస్‌వీవీఆర్‌కే ప్రసాదబాబు, ఇంజినీర్ ఎస్‌వీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.


వికాస ద్వారా ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

కరప: మండల పరిధిలోని నిరుద్యోగ యువకులకు వికాస ద్వారా ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు ఈనెల 3, 5, 6 తేదీలలో వివిధ సంస్థల ప్రతినిధులు ఇంటర్యూలు నిర్వహిస్తారని ఎంపీడీఓ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో ఈ నెల 3వ తేదీన ఉదయం 10 గంటల నుంచి కరప, వలసపాకల, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, పాతర్లగడ్డ, పెనుగుదురు, నడకుదురు, గురజనాపల్లి, ఉప్పలంక గ్రామాల వారికి, పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ(ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో 5వ తేదీన ఉదయం 10 గంటల నుంచి పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, కొంగోడు, యండమూరు, గొర్రిపూడి గ్రామాల వారికి, వేళంగిలోని మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి వేళంగి, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, కూరాడ, సిరిపురం, జి.భావారం గ్రామాలవారికి ఇంటర్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లమో, గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఎంపీడీఓ అప్పారావు కోరారు.

కుష్ఠు వ్యాధి వైద్య శిబిరం

కాకినాడ రూరల్: కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలలో భాగంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్యసేవలందించారు. డాక్టరు కె.వెంకటరమణ రోగులను పరీక్షించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అడబాల రత్నప్రసాద్, యనమల రామం, రెడ్నం రాజా పాల్గొన్నారు.

శత్రు సైన్యానికి వణుకు పుట్టాల్సిందే!





కాకినాడ సముద్ర తీరంలో ఇండియన్ ఆర్మీ, నేవీ సైన్యాలు చేస్తున్న విన్యాసాలు

కాకినాడ రూరల్: ఇండియన్ ఆర్మీ, నేవీ సంయుక్త ఆధ్వర్యంలో జల ప్రహార్‌లో భాగంగా కాకినాడ సాగర తీరంలో శత్రువులకు వణుకు పుట్టేలా ఆ దళాలు విన్యాసాలు చేశాయి. విశాఖ, కాకినాడ తీరంలో నిర్వహించిన విన్యాసాలు బుధవారంతో ముగిశాయి. తూర్పు నావికాదళం, ఇండియన్ ఆర్మీ సిబ్బంది వాయుసేన విమానంతో గాలిలోను, యుద్ధ నౌకలతో సముద్ర జలాలోను, నేలపై సముద్ర జలాల్లో విన్యాసాలలో పాల్గొన్నాయి. ఉమ్మడి దళాలు శిక్షణలో పాల్గొని సత్తా చాటాయి.

ఉపాధ్యాయుల బకాయిలు విడుదల చేయాలి

కాకినాడ సిటీ: యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ కాకినాడ ధర్నా చౌక్ వద్ద జిల్లా యూటీఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఫిబ్రవరి 3వతేదీ వరకు రిలే నిరాహారదీక్షలు కొనసాగుతాయని నాయకులు ప్రకటించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సేవలకు సత్కారం



అటెండర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: కార్పొరేషన్ కార్యాలయంలో 40 ఏళ్ల పాటు సేవలందించిన అటెండర్ అల్లం సత్య ప్రసాద్, మెప్మా విభాగం సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యంలకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. కమిషనర్ నాగ నరసింహారావు వారిని ఘనంగా సత్కరించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ ఎస్ఈ ఎం.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.